'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

# ఆ రెండు పార్టీలకు చరమగీతం



కనకదుర్గ దంటు
89772 43484

**2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత సామాజిక మాధ్యమాలలో ఆ ఫలితాల మీద చర్చలు నడుస్తున్న తీరును చూస్తుంటే నిర్వేదం వస్తోంది. నవ్వాలో, ఏడ్వాలో కూడా తెలియని పరిస్థితి! 2023లో తెలంగాణలో ఏర్పడిన పరిస్థితే 2024 శాసనసభ ఎన్నికల తర్వాత ఏపీలో కూడా ఏర్పడింది. ఇక రాజకీయ విశ్లేషకులు, జ్యోతిష్యులు (ఇద్దరికీ పెద్ద తేడా లేదు లెండి!) తమ తమ అద్భుత ప్రసంగాలతో అలరించేస్తున్నారు.**

**వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన జగన్ పార్టీ కంటే, అనేక కేసుల్లో ఇరుక్కొని జైల్లో ఉన్న చంద్రబాబు (కూటమి)కు ఇంకా 14 సీట్లు ఎక్కువ ఎలా వచ్చాయి? ఇప్పుడు జగన్ ఏమి చేయాలి? ఏం చేస్తాడు? సీట్లు ఎక్కువ ఎందుకు రావు? పగలు పడ్డ ఓట్ల కంటే రాత్రంతా కూర్చుని 140 నియోజకవర్గాలలో ఈవీఎంలలో 100 శాతం ఓటింగ్ జరిగేటట్టు చేస్తే ఎవరైనా గెలుస్తారు! ఈ లెక్కన 140 + 11 = 151 నియోజకవర్గాలలో జగన్ గెలిచి ఉంటాడు. లేకపోతే గెలిచిన నాయకుల పోస్టర్లను ప్రజలు ఎందుకు చింపుతున్నారు? పేడ కొడుతున్నారు? ఆలోచించండి.**

ఇక కేంద్ర పరిస్థితి! తను బీజేపీ తరపున 250 సీట్లు తెచ్చుకుంటే ఇంకొక 150 అయోధ్యలో తను చెయ్యి పట్టుకొని తీసుకెళ్లిన బాలరాముడు తెచ్చి పెడతాడు, 400 గెలుస్తామని అహంకరించిన నరేంద్ర మోదీ మెజారిటీ కూడా సాధించలేకపోవటం ఎందుకు? ఇది ఎవరైనా ఆలోచిస్తున్నారా? మోదీ ఉంటాడా? ఊడతాడా? చంద్రబాబు అమరావతిని ఇంకో పదేండ్లలో కట్టేస్తాడా? ఎన్నికల మర్నాడే అక్కడ ఎకరం 50 లక్షలైందని ఆంధ్రజ్యోతి రాసేస్తే నమ్మొద్దామా? ఇవేనా ఈ మేధావులు మాట్లాడవలసిన మాటలు?

నిజానికి తెలుగు రాష్ట్రాల ఎన్నికలు, కేంద్ర ప్రభుత్వం ఏర్పడటానికి జరిగిన ఎన్నికలు ఏం సూచిస్తున్నాయి? ఈ విషయాన్ని ఎవరైనా ఆలోచిస్తున్నారా? మోదీ మొహం మాడిపోయింది, అహంకారం ఇంకైనా తగ్గుతుందా? అని గంటలు గంటలు విశ్లేషణ ఎవరికి ఉపయోగం? జరిగిన కార్యం గురించి కాకుండా, కారణం గురించిన వివరాలు మాట్లాడటం లేదు. ఎన్నికలయ్యాక ప్రజలతో పనైపోయిందా? అసలు ఈ ఎన్నికల ఫలితాలతో ప్రజల నాడిని పసిగట్టడానికి ఎలా ఆలోచించాలి? వారేమనుకుంటున్నారు? ఇవి కదా ముఖ్యమైన అంశాలు. 303 సీట్లు వచ్చిన మోదీ 240 దగ్గర ఎందుకు ఆగాడు? ప్రజల మనసుల్లో ఏముంది? ఎందుకు ఆగాడంటే, మోదీకి, బీజేపీకి మూడింది! ప్రజాభిమానం, మతపిచ్చి పోయాయి. మరి 52 వచ్చిన కాంగ్రెస్ 99 తెచ్చుకుంది. అంటే ప్రజాభిమానం ఆ పార్టీకి పెరిగిందా? నిజానికి అభిమానం పెరిగి కాదు,



ప్రజలు వేరే దిక్కు లేక ఈ పార్టీ వద్దు అని ఆ పార్టీకి వేశారు. నిజంగా ప్రజాభిమానం ఉంటే కనీసం 200 సీట్లు గెలవాలి కదా! అంటే బీజేపీకి తగ్గిన 63 సీట్లయినా కాంగ్రెస్‌కు రావాలి కదా! లేదు ఆ రెండు జాతీయపార్టీలకు కాలం చెల్లింది. ఎక్స్పైరీ తేదీ వచ్చింది, మరిప్పుడు ఏం చేయాలి?

అసలు భారతదేశ స్వరూపానికి, ప్రకృతికి ఈ జాతీయపార్టీల కేంద్రీకృత పరిపాలన సరిపడదు. ప్రాంతీయతను, ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పరిపాలించే స్థానిక పార్టీలు మాత్రమే వైవిధ్యభరితమైన ఈ దేశానికి అత్యవసరం. ప్రజల పట్ల అభిమానం, వారికి కావలసిన అవసరాలు, ప్రాంత వనరుల సంరక్షణ వాటిని సరిగ్గా ఉపయోగించటం, ప్రజల జీవన ప్రమాణాలు, ఆదాయం పెంచటం వంటివి గత తొమ్మిదేండ్లలో తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే జరిగాయి. ముఖ్యమంత్రి ఒక కుటుంబ పెద్దగా, తండ్రి వలె పరిపాలించటం స్వాతంత్ర్యానంతరం ఒక తెలంగాణ రాష్ట్రంలోనే తొమ్మిదేండ్లు జరిగింది. కానీ అమాయకత్వం, అజ్ఞానం, కాంగ్రెస్ అబద్ధాల హామీల జోరులో రాష్ట్రం నష్టపోయి ఆ పార్టీని గెలిపించింది. ఖర్మ ఏమిటంటే తెలుగు రాష్ట్రాలు రెండూ ఓటుకు నోటు దొంగల పాలయ్యాయి. మరిప్పుడు ఈ ప్రాంతీయ పార్టీలు ఏం చేయాలి? బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారింది దేశం కోసమేనని అందరికీ తెలుసు!

**అమాయకత్వం, అజ్ఞానం, కాంగ్రెస్ అబద్ధాల హామీల జోరులో రాష్ట్రం నష్టపోయి ఆ పార్టీని గెలిపించింది. ఖర్మ ఏమిటంటే తెలుగు రాష్ట్రాలు రెండూ ఓటుకు నోటు దొంగల పాలయ్యాయి. మరిప్పుడు ఈ ప్రాంతీయ పార్టీలు ఏం చేయాలి? బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారింది దేశం కోసమేనని అందరికీ తెలుసు!**

ప్రతి రాష్ట్రంలో స్థానిక పార్టీలు బలపడాలి. కనీసం వచ్చే ఎన్నికల నాటికి ఈ రెండు జాతీయపార్టీలను రంగంలో లేకుండా చేసి రాష్ట్రాలన్నింటిలో సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ అభిమానం ఉన్న నాయకులు గెలవాలి. అటువంటి వారు ఇప్పుడు కొందరున్నారు. కేసీఆర్, నవీన్ పట్నాయక్, నితీశ్‌కుమార్, కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి మేధ, ప్రజ్ఞ, పరిపాలనాదక్షత కలిగిన నాయకులు ఇప్పుడు ముందుకురావాలి.

అధికారం కోసం జాతీయపార్టీలతో కలవకుండా ఆ పార్టీలను విసర్జించి ప్రజల్లో ప్రాపకం పెంచుకొని ఎన్నికలు గెలవాలి. కేంద్రంలో ఈ పార్టీలన్నీ కలిసి ఒక సమాఖ్యగా ఏర్పడి ప్రభుత్వాన్ని నడపాలి. కొద్ది గా స్వార్థం వదులుకొని దేశమంతా ఒక్కటన్న భావనతో ఒకరి రాష్ట్రానికి మరొకరు సహాయంగా నిలవాలి. అటువంటి ఫెడరల్ ప్రభుత్వమే ఈ దేశాన్ని ఉద్ధరిస్తుంది. ఇకనైనా ప్రాంతీయపార్టీల నేతలు ఆలోచించాలి.

**జాతీయపార్టీలు రెండూ ప్రజాభిమానాన్ని కోల్పోయాయి. ఇక దేశానికి ఈ నాయకులే దిక్కు. దయచేసి మీ మీ పార్టీలను బలోపేతం చేసుకుని దేశం కోసం, ప్రజల కోసం ఆలోచించండి, నాయకుల కోసం కాదు. దేశం బాగు పడాలంటే ప్రజలు బాగుపడాలి, నాయకులు కాదు!**

# మూడు రాష్ట్రాలు.. మోదీకి అగ్నిపరీక్ష

**పాథాలజిస్టుల కంటే వేగంగా ఎన్నికల అనంతరం విశ్లేషణలు చేసే అనేకమంది రాజకీయ విశ్లేషకులలాగా తానేమీ రాజకీయ పండితుడిని కాదని అంగీకరించేందుకు ఈ రచయితకు ఎలాంటి సంకోచం లేదు. కానీ, కొన్ని విషయాలు మాత్రం రాజకీయాల పట్ల ఆసక్తి ఉండే నాలాంటి ఔత్సాహిక విద్యార్థులకు కూడా స్పష్టంగా అర్థమవుతాయి. ఈ రాజకీయ విశ్లేషణ రంగంలో రెండు విషయాలు ప్రముఖంగా కనిపిస్తాయి. వాటిలో మొదటిది, ఈ పాలనను మోదీ 3.0గా ఎలా వివరిస్తారు? ఇది అంత ప్రధానమైన విషయం కాదు, పేరు గురించి మాత్రమే. రెండోది, చాలా ముఖ్యమైనది. ఈ పాలన పూర్తిగా ఐదేండ్ల పాటు కొనసాగుతుందా? లేదా 1999లో అప్పటి ప్రధాని వాజపేయి విశ్వాస తీర్మానంలో ఓడిపోయిన విధంగా మళ్లీ మనం చూడబోతున్నామా? ఈ నేపథ్యంలో ఎవరికి ఏ మంత్రి పదవి ఇచ్చారు, ఎవరు ఏ శాఖపై మల్లగుల్లాలు పడుతున్నారనేది క్షణికావేశం మాత్రమే.**



సుతాను గురు



ఇప్పుడు పేరు (మోదీ 3.0) గురించి చూద్దాం. వాస్తవానికి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ ఇలా ప్రతీ మీడియా ప్లాట్‌ఫారమ్ దీన్ని మోదీ 3.0గా అభివర్ణిస్తున్నది. సాంకేతికంగా వారు చెప్పేది సరైనదే కావచ్చు. నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యారు. కానీ, ఆ వివరణ వాస్తవికతను మభ్యపెడుతున్నది. ప్రతి ర్యాలీలో, ప్రతి ప్రసంగంలోనూ ఈ ఎన్నికలు తన పాలనకు రెఫరెండమని మోదీ ప్రచారం చేశారు. బీజేపీ 370 సీట్లు దాటుతుందని, ఎన్డీయే కూటమి 400 స్థానాల్లో గెలుస్తుందని ఢంకా బజాయించారు. అయితే ఫలితాల్లో వచ్చిన అంకెల ప్రకారం చూస్తే.. ఈ రెఫరెండమనేది మోదీకి మిశ్రమంగా ఉన్నది. పదేండ్ల పాటు నిరంతరాయంగా దేశాన్ని పాలించిన వ్యక్తి తన పార్టీని 240 సీట్లలో గెలిపించడం, తన ప్రధాన ప్రత్యర్థి పార్టీ కాంగ్రెస్ కంటే రెండున్నర రెట్లు ఎక్కువ స్థానాలు పొందడం విశేషం. అయితే దీనివెనుక అసలు వాస్తవం వేరే ఉన్నది.

ఇది పూర్తిగా మోదీ విజయం కాదు. చంద్రబాబు, నితీశ్‌కుమార్‌లు లేకపోతే మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసేవారు కాదు. నేను ఈ పాలనను మోదీ 3.0గా కాకుండా ఎన్డీయే 5.0గా అభివర్ణించాలనుకుంటున్నాను. ఇది పర్సెప్షన్‌కు సంబంధించిన విషయం. పర్సెప్షన్ అనేది రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తుంది. పర్సెప్షన్‌కు సంబంధించిన తర్వాతి పోరు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగనున్నది. ఇండియా కూటమిలోని పార్టీలు, కొంతమంది మోదీ వ్యతిరేకులు ప్రభుత్వం కూలిపోతుందని అంచనా వేయడం మొదలుపెట్టారు. మంత్రి పదవులు, శాఖల కేటాయింపులో జరుగుతున్న వివాదాలే అందుకు మొదటి సంకేతమని వారు చెప్తున్నారు. ఇది చిన్నపిల్లల విశ్లేషణ. ప్రభుత్వం సురక్షితంగానే ఉన్నది. కనీసం అక్టోబర్ వరకు అంటే.. రోహతక్, రాంచీ, రాయ్‌గఢ్ ఈ ఆటలోకి వచ్చేంతవరకు ప్రభుత్వం సురక్షితంగానే ఉంటుంది. ఆ తర్వాత ఏమైనా జరగవచ్చు. రోహతక్, రాంచీ, రాయ్‌గఢ్ ఎందుకంటే.. అక్టోబర్‌లో హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

రాజకీయం అనేది పర్సెప్షన్‌కు సంబంధించినది. కాబట్టి, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, జై శంకర్‌లకు పాత శాఖలనే కేటాయించి తన మూడో పర్యాయం పాలనను నరేంద్ర మోదీ ప్రారంభించడం వెనుక కూడా బలమైన పర్సెప్షన్ ఉంది. అదేమిటంటే.. కొనసాగింపు, స్థిరత్వం. కానీ, పర్సెప్షన్ అనేది చాలా త్వరగా మారిపోతుంది. మరీ ముఖ్యంగా పర్సెప్షన్ మార్పును సరిదిద్దడంలో, అంచనా వేయడంలో విశ్లేషకుల కంటే రాజకీయ నటులు చాలా తెలివైనవారు. దానికి అనుగుణంగా వారు వ్యవహరిస్తారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఎలా వ్యవహరిస్తారనే అంశమే.. ఎన్డీయే కూటమిలోని పార్టీలు టీడీపీ, జేడీయూ, ఎల్జేపీ, జేడీఎస్ తమ పాచికలను ఎలా పారిస్తాయన్నది నిర్ణయించనున్నది.

**అతి విశ్వాసంతో యూపీలో క్షేత్రస్థాయిలో బీజేపీపై ఉన్న వ్యతిరేకతను అంచనా వేయడంలో అత్యధికమంది విశ్లేషకులు విఫలమైనట్టుగానే.. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఎటువైపు ఉంటుందనేది అతివిశ్వాసంతో చెప్పడం కూడా వెర్రితనమే అవుతుంది. కానీ, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీల పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి కొంతమేరకు అవగాహనకు రావచ్చు.**

మొదట హర్యానా గురించి చెప్పుకోవాలి. పదేండ్ల బీజేపీ పాలన తర్వాత హర్యానాలో కాంగ్రెస్ పార్టీ పునరుత్థానానికి రోహతక్ ప్రతీకగా నిలవనున్నది. ఇది ఎప్పటికీ కాంగ్రెస్‌కు కంచు కోటే. దాంతోపాటు రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన భూపేందర్‌సింగ్ హుడాకు స్వస్థలం కూడా. ఇటీవల 63 శాతం ఓట్లతో ఆయన కుమారుడు దీపేందర్ హుడా రోహతక్ నియోజకవర్గంలో గెలుపొందారు. పదేండ్ల డబుల్ ఇంజిన్ సర్కార్ పట్ల వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంకా చాలా కారణాలున్నాయి. హర్యానాలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, బీజేపీ ఓటమి పాలయ్యే అవకాశాలున్నట్టు చెప్పవచ్చు. జార్ఖండ్ ప్రత్యేక రాజకీయాలను కలిగి ఉన్నది. ఆ రాష్ట్రం ఏర్పడిన 2000 నుంచి 2014 వరకు అస్థిర ప్రభుత్వాల పాలనే కొనసాగింది. ఆ తర్వాత బీజేపీ నేతృత్వంలోని కూటమి ఐదేండ్లు పాలించింది. ఇప్పుడు జేఎంఎం కూటమి పాలన కొనసాగుతున్నది. మనీ లాండరింగ్ అభియోగాలపై ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఇక్కడ ఇరు పక్షాలకు సమాన అవకాశాలున్నట్టు చెప్పడం సరైనది. 48 ఎంపీ సీట్లు, 294 ఎమ్మెల్యే స్థానాలున్న అతి ముఖ్యమైన రాష్ట్రం మహారాష్ట్ర విషయానికొస్తే.. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి షాక్ ఇచ్చాయి. ఆ పార్టీ బలం 23 నుంచి 9కి పడిపోయింది. దాని మిత్రపక్షాలు కూడా సరైన ప్రదర్శనను కనబరచలేదు. అందుకు విరుద్ధంగా ఎంవీఏ కూటమి ఉల్లాసంగా, విశ్వాసంగా కనిపిస్తున్నది. పర్సెప్షన్ మాత్రం ఎంవీఏ కూటమికి అనుకూలంగా ఉన్నది. ఇరుపక్షాలకు సీట్ల పంపకాల విషయంలో సమస్యలు ఎదురవుతాయి. అయితే ఓటములు, ప్రతికూల పరిస్థితుల నుంచి కోలుకొని మరింత బలంగా తిరిగి వస్తుందని బీజేపీకి పేరున్నది. అయినప్పటికీ మహారాష్ట్రలో ఎంవీఏ కూటమే మెరుగైన స్థితిలో ఉందనేది నా భావన.

ఒకవేళ ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోతే ఆ పార్టీకి, అగ్రనాయకత్వానికి అనేక పరిణామాలు ఎదురవుతాయి. అదే కనుక జరిగితే ఇకపై 'బ్రాండ్ మోదీ' ఇదివరకటిలా ధగధగలతో ప్రకాశించదనే పర్సెప్షన్‌లో గణనీయమైన పెరుగుదల అతి ముఖ్యమైనది. అప్పుడు చంద్రబాబు, నితీశ్‌కుమార్ ఏం చేస్తారో? రాబోయేరోజులు చాలా ఆసక్తికరంగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

**48 ఎంపీ సీట్లు, 294 ఎమ్మెల్యే స్థానాలున్న అతి ముఖ్యమైన రాష్ట్రం మహారాష్ట్ర విషయానికొస్తే.. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి షాక్ ఇచ్చాయి. ఆ పార్టీ బలం 23 నుంచి 9కి పడిపోయింది. దాని మిత్రపక్షాలు కూడా సరైన ప్రదర్శనను కనబరచలేదు. అందుకు విరుద్ధంగా ఎంవీఏ కూటమి ఉల్లాసంగా, విశ్వాసంగా కనిపిస్తున్నది. పర్సెప్షన్ మాత్రం ఎంవీఏ కూటమికి అనుకూలంగా ఉన్నది. ఇరుపక్షాలకు సీట్ల పంపకాల విషయంలో సమస్యలు ఎదురవుతాయి.**

**(వ్యాసకర్త: సీ ఓటర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)**
**'ది క్వింట్' సౌజన్యంతో...**




## కేంద్రంలో ఉన్నది మూడు చక్రాల రిక్షా

*మా ప్రభుత్వం (ఎంవీఏ) మూడు చక్రాల రిక్షా లాంటిదని దేవేంద్ర ఫడ్నవీస్ గతంలో ఎద్దేవా చేశారు. ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా అలాంటిదే. నిన్నటి మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వంగా మారింది. చూద్దాం.. ఈ ప్రభుత్వం ఎన్నాళ్లుంటుందో?*

**- ఉద్ధవ్ ఠాక్రే,**
*శివసేన (యూబీటీ) పార్టీ అధినేత*



# శకుని పాచికలే ఈవీఎంలు

**'పాచికలు ఆడుదాం రండి' అని పాండవులను పిలిచిండు దుర్యోధనుడు. పాండవుల పెద్దన్నగా యుధిష్ఠుడు తన పరివారంతో హస్తినకు వెళ్లిండు. పాచికలు ఆడటానికి సిద్ధమై వేదికపై ఆసీనుడయ్యాడు. కౌరవాగ్రజునిగా దుర్యోధనుడు అతనికి ప్రతివుజ్జి. అతడు కూడా వచ్చిండు. కానీ.. 'నేను ఆడ్తలేను. నా బదులు మా మామ శకుని ఆడ్తడు' అని చెప్పి దుర్యోధనుడు తప్పుకున్నడు.**

**ఇది తొండి అని అనవచ్చు కానీ, ధర్మరాజు అలా అనలేదు. ఎందుకంటే.. ఆయన యథార్థకారుడు. ధర్మమే జయిస్తుందని నమ్మిన క్షత్రియుడు. శకుని ప్రతిస్థానంలో కూర్చున్నడు. అతను భ్రమకారుడు. పాశ-దిష్టాద్రి క్షుద్ర విద్యలను అవపోసన పట్టిన జిత్తుల మారి ద్యూతకృత్తుడు. మాయ పాచికలను శకుని విసిరిండు. ఫలితాలను పల్టీలు కొట్టించిండు. పాండవుల సంపదను, రాజ్యాన్ని, వారి భార్య ద్రౌపదిని కురుసంతుకు దోచిపెట్టిండు.**



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

ఐదేండ్లకోసారి జరుగుతున్న ఎన్నికల సంగ్రామంలో ఈవీఎంలు కూడా శకుని పాచికలనే తలపిస్తున్నయి. వాటి విశ్వసనీయత, పారదర్శకతపై ప్రతిసారి దేశవ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తమవుతూనే ఉన్నయి. కానీ, యుగాలు గడిచినా శకుని క్షుద్ర రీతికి హేతు ఊతం దొరకదు. తరాలు మారినా ఈవీఎం మార్మికం తీరుకు శాస్త్రీయ ఊనిక అందదు. అదేమి చిత్రమో కానీ.. ఆంధ్రప్రదేశ్‌లో మోదీతో పొత్తు పెట్టుకున్న కూటమికి దక్కిన అనూహ్య ఫలాలపై జనం విస్మయం చెందుతున్నరు. శకుని పాచికలేవో పారినట్టు.. అదృశ్య సంజ్ఞలేవో ఫలితాలను పల్టీ కొట్టించినట్టు సగటు ఓటరు పుర్రెను తొలుస్తున్నది. ఆంధ్రా ఓటరు అనుమానానికి కేరళ రాష్ట్రంలో సమాధానం దొరికింది. కానీ, అది అసలు శాస్త్రీయ ఆధారమే కాదంటోంది ఎన్నికల కమిషన్. ఏప్రిల్ 17న కేరళలోని కాసర్‌గోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఈసీ అన్ని పార్టీల నేతలను పిలిచి మాక్ పోలింగ్ నిర్వహించింది. ఆ పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ తెచ్చిన ఈవీఎంలలో ఏ గుర్తు బటన్ నొక్కినా కమలం గుర్తుకే ఓట్లు పడ్డాయట. ఇదెక్కడి మోసం సారూ! అనుకుంట ఎల్డీఎఫ్, యూడీఎఫ్ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేయగా.. 'ఏహే అది ఉత్తుత్తి పోలింగేనాయే' అని బుకాయించిందట.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో.. వేసిన ఓటు నమోదు అయిందా? నమోదైన ఓటు లెక్కలోకి వస్తున్నదా? లేదా అని తెలుసుకునే హక్కు కూడా అంతే ముఖ్యం. బ్యాలెట్ ఓటు ఉన్నంతకాలం సగటు ఓటరు హక్కుకు ఎటువంటి భంగం లేకుండే. కానీ, ఈవీఎంలు వచ్చిన తర్వాత వేసిన ఓటు నమోదైందా? నమోదైన ఓటు లెక్కలోకి వచ్చిందా? అనేదానికి భరోసా లేకుండాపోయింది. ఓటరు ఈవీఎంలో ఓటు వేస్తాడు. అది అదృశ్య శక్తి. కాబట్టి వేసిన ఓటు పడ్డదో? లేదో? వీవీప్యాట్‌లో చూసుకుంటాడు. ఎన్నికల సంఘం మాత్రం కనిపించని ఓటునే ప్రామాణికంగా తీసుకొని లెక్కిస్తున్నది. ఓటు హక్కుదారునికి భరోసానిచ్చే వీవీప్యాట్ స్లిప్పులను మాత్రం పక్కనపెడుతున్నది. ఇదెక్కడి ధర్మం?

**ఈవీఎంలలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు చాలాచోట్ల పొంతన కుదరటం లేదు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ గణాంకాలే దీన్ని ధ్రువపరుస్తున్నయి. 2019 సాధారణ ఎన్నికల్లో 345 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఈవీఎంలలో పోలైన ఓట్ల సంఖ్యకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఉన్నట్టు తేలింది. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ 140 పైచిలుకు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోలైన ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నదని 'ది వైర్' వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ వ్యత్యాసానికి ఈసీ సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోతున్నది.**

క్లోనింగ్‌తో అండం లేకుండానే పిండం పుట్టిస్తున్న రోజులివి. క్లౌడ్‌సీడింగ్‌తో నింగి మీది మబ్బులకు పొక్కలు పొడిసి నీళ్లు పిండుతున్న కాలమిది. టెక్నాలజీ ప్రతి ఆరు నెలలకో, ఏడాదికో ఒకసారి అప్‌గ్రేడ్ అయిపోతున్నది. 2007లో వచ్చిన తొలి ఐఫోన్ సైబర్ సవాళ్లకు తట్టుకోవడానికి టెక్నాలజీ అప్‌గ్రేడ్‌తో 17 సార్లు రూపాంతరం చెందింది. కానీ, 25 ఏండ్ల కిందటి వృద్ధ కపోతాలైన మన ఈవీఎంలు ఇప్పటివరకు అప్‌గ్రేడ్ అయినట్టు లేదు. ఇంతటి పాత మిషన్లకు సైబర్ సవాళ్లను తట్టుకొని ట్యాంపరింగ్ కాకుండా నిలబడే దమ్ముందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సాంకేతికంగా మనకంటే ముందున్న జర్మనీ, నెదర్లాండ్, ఐర్లాండ్, ఇంగ్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్ లాంటి దేశాలు ఈవీఎంలను ఎన్నికల్లో ఉపయోగించడాన్ని నిషేధించాయి.

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో మళ్లీ వెనక్కి వెళ్లి బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించడం కష్టసాధ్యమే. బ్యాలెట్ ఓటింగ్‌తో బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ రిగ్గింగ్ జరిగే అవకాశాలున్నాయి. ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లని ఓట్లను హెచ్చించి చూపే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో కచ్చితత్వం, వేగంతో పోలింగ్ నిర్వహించగల వ్యవస్థను రూపొందించటం అత్యవసరం. దీనికో మార్గం ఉన్నది. ఈవీఎంలో ఓటు వేశాక.. ఓటరు చేతికి స్లిప్ ఇస్తే సరి చూసుకుంటాడు. అనుమానం నివృత్తి చేసుకుంటాడు. అదే స్లిప్‌ను ఓట్ల పెట్టెలో వేయించాలి. ఈసీ ఈ స్లిప్పులను ప్రామాణికంగా తీసుకొని లెక్కిస్తే ఓటరుకు సంపూర్ణ భరోసా దక్కుతుంది.

## లేఖ

### పాఠ్య పుస్తకాలకు అతుకులా?

**రాష్ట్రవ్యాప్తంగా** బడులు పునః ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులను సంపూర్ణంగా ఆస్వాదించిన విద్యార్థులు బ్యాగులు తీసుకొని బడిబాట పడుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. పాఠ్య పుస్తకాల్లో మాజీ సీఎం కేసీఆర్ పేరు ముద్రితమైందని ఆ పేజీలను చించి, అంటించే వినూత్నమైన పనిని ముందటేసుకున్నది. ముఖ్యమంత్రి పదవిలో హుందాగా వ్యవహరించాల్సిన రేవంత్‌రెడ్డి ఇంత కురచగా ఆలోచించడం పట్ల తల్లిదండ్రులే కాదు, విద్యార్థులూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం స్థాయి వ్యక్తి ఆలోచనా విధానాలు హుందాగా ఉండాలె కానీ, ఇంత కురచగా ఉండటమేందని ఈసడించుకుంటున్నారు.

**- నర్మాల కృష్ణతేజ, కరీంనగర్**